క్లుప్తంగా

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేష్



ధర్మసాగర్ (వేలేరు) : బీఎస్పీ జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తను నియామకమైనట్టు మండలంలోని సోడషపల్లి గ్రామానికి చెందిన బుట్టి సురేష్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామికి, నాయకులకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

భవనంపై నుంచి పడి విద్యార్థికి గాయాలు

ఎల్కతుర్తి : రేగుపండ్ల కోసం వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు పాఠశాల భవనంపై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని ఇందిరానగర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని దామెర గ్రామానికి చెందిన అఖిల్ మండలంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అఖిల్ రేగుపండ్ల కోసం స్నేహితులు రవికాంత్, రేవంత్‌లతో కలిసి పాఠశాల భవనంపైకి ఎక్కి కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. తోటి విద్యార్థులు సమాచారం అందించడంతో అఖిల్‌ను ఉపాధ్యాయులు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది.

విద్యుత్ కోతలకు నిరసనగా నేడు ధర్నా

పరకాల : ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వకుండా గంటల కొద్దీ కోతలు పెడుతుండడాన్ని నిరసిస్తూ నేడు (ఆదివారం) పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ఎదుట ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ధర్నా చేపడతామని పేర్కొన్నారు. శ్రేణులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సంఘం బలోపేతానికి కృషి చేస్తాం

ఆత్మకూరు : రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవూరి ప్రభాకర్‌రెడ్డి, జిన్నా రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తమను ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌కు పరామర్శ

దామెర : మండలంలోని దుర్గంపేట గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పురాణం ఈశ్వర్, (గ్రామ సర్పంచ్ రాజేశ్వరి భర్త)ను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఈశ్వర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను ఎమ్మెల్యే కలిసి మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, పెద్దాపూర్ పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు తదితరులున్నారు.

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎంపీపీ గోపు మల్లికార్జున్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను తెలంగాణ రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోర్లంట్ల సంజీవులు ఇటీవల మృతి చెందిన క్రమంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వెంకటేశ్వర్లు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు రాయరాకుల సాయిలు, కాశినాదం, చంద్రమౌళి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్..

మండల కేంద్రానికి చెందిన తాళ్ల రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

గౌరవ వేతన పెంపు అభినందనీయం

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట సహాయకులకు ప్రభుత్వం గౌరవ వేతనాన్ని వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచడం అభినందనీయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అభ్యర్థన మేరకు సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ సమావేశాల్లోనే సానుకూలంగా ప్రకటించారని గుర్తు చేశారు. కాగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో పని చేస్తున్న 54,201 మందికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం జీఓ విడుదల చేయడం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

ఎల్కతుర్తి : రైతులు కూరగాయాల సాగుపై ఆసక్తి చూపుతూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. తమకున్న కొద్దిపాటి భూమిలో వంకాయ, బెండకాయ, సోరకాయ, చిక్కుడు, కొతిమీర, మెంతికూర, ఉల్లాకు, పచ్చిమిర్చి తదితర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వాటిని రైతులే హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

మండలంలోని వల్బాపూర్ గ్రామ రైతులు పలు రకాల కూరగాయలు పండిస్తూ వాటిని సమీపంలోని వరంగల్, హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలకు తరలించి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కొన్నేళ్లుగా గ్రామం కూరగాయల సాగుకు కేరాఫ్‌గా నిలుస్తోందంటే అతిశయోక్తి లేదు. ఒకటి, అర ఎకరం భూముల్లో కూరగాయలను సాగు చేస్తుండడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఏడాదిపాటు పండించిన పంటకు ప్రభుత్వం సరైనా గిట్టుబాటు ధర కల్పించక పోతుండడంతో రైతులే కూరగాయ పంటలు సాగు చేసి స్వయంగా మార్కెటింగ్ చేస్తున్నారు. తద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయలకు వరంగల్, ఇతర మార్కెట్లలో డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ తమ తగ్గర కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. కూరగాయ పంటలకు మార్కెట్లో సరైనా ధర లభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



రైతు సాగు చేసిన బెండకాయ



పెట్టిలో పోసిన టమాటాలు

సాగుతో అధిక లాభాలు



నాకు ఎకరం భూమి ఉంది. అందులో 20 గుంటల్లో టమాట, మరో 20 గుంటల్లో బెండకాయ పంట సాగు చేశా. పండిన పంటను మార్కెట్‌కు తరలిస్తున్నా. టమాట బాక్స్‌కు రూ.300–400లు వరకు ధర లభిస్తోంది. కాగా బెండకాయ కిలో ధర రూ.50–60 ఉంది. ఖర్చులు పోగా రోజుకు రూ.2–3 వేల లాభం ఉంటోంది.

-అంబాల ప్రమీల, రైతు, వల్బాపూర్

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



పండించిన పంటలను రైతులే స్వయంగా అమ్ముకునేలా ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. పట్టణాల్లో దళారుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పండించిన కూరగాయలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. విత్తనాలను రాయితీపై అందిస్తే కురగాయాల సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

-కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి

‘ఏసీడీ’ని వెంటనే రద్దు చేయాలి



దామెర : ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆత్మకూరులో..

దామెర : ఏసీడీ చార్జీలు వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు 24 గంటలూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఊదరగొట్టి ఓట్లు దండుకుని సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి కనీసం 12 గంటల త్రీఫేజ్ కరెంటు సరఫరా చేయడం లేదని విమర్శించారు. రబీలో పంటలకు మోటర్లతో నీటిని సరఫరా చేసుకోవాల్సిన సమయంలో నాణ్యమైన విద్యుత్ అందించడం లేదని మండిపడ్డారు. వెంటనే ఏసీడీ చార్జీలను రద్దు చేయడంతోపాటు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జక్కుల ఇందిరా, ఎంపీటీసీ శనిగరం కళ సుధాకర్, దామెర ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు ఎస్‌రెడ్డి కరుణాకర్, సదిరం పోచయ్య, దుబాసి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి

ఆత్మకూరు : రైతులకు 24 గంటలు త్రీఫేజ్‌తో ఉచిత కరెంటు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. అలాగే సబ్‌స్టేషన్ వద్ద ఏఈ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రైతులకు అవసరమైన మేరకు కరెంటు సరఫరా చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, చౌళ్లపెల్లి సర్పంచ్ కంచ రవికుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు పర్వతగిరి రాజు, బయ్య తిరుపతి, సత్యనారాయణ, దేవరాజు, సందీప్, పీఏసీఎస్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, అలువాల రవి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : చల్లా

ఆత్మకూరు : మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో రూ.3.60 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. అన్ని కాలనీల్లోనూ తిరుగుతూ ప్రజలను కలిసి సమస్యలు అధ్యయనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ, ఇతర అన్ని సమస్యలనూ పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిసూ అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన తాళ్ల రవి, కామారం గ్రామానికి చెందిన జన్ను కొమ్మాలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ అంకూస్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్, నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, బాషబోయిన సాగర్, పైడి, ప్రవీణ్‌రెడ్డి, అంద్య విశ్వేశ్వర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

వేడుకగా అయ్యప్ప ప్రతిష్ఠాపనోత్సవాలు

కమలాపూర్ : మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ ధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అయ్యప్ప స్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. మూడ్రోజులపాటు ఉత్సవాలు జరగనుండగా శనివారం ఉదయం నిత్య పూజలు, నిత్యహోమాలు, నిత్య పూర్ణాహుతి, అభిషేకాలు, సాయంత్రం ధాన్యాధివాసం, ఆదివాస హోమాలు, నిత్య హోమం, నిత్య పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ శాశ్వత ధర్మకర్త, గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు, లక్ష్మణమూర్తి, విజయ శేఖరాచార్య, తిరువేంగళాచార్యులు, సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రాజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండపెల్లి మల్లారెడ్డి, కోశాధికారి రామగిరి శ్రీధర్, డైరెక్టర్లు జక్కు కృష్ణమూర్తిగౌడ్, మౌటం కుమారస్వామి, గువ్వాడి సదానందం, పల్లపు రవి, అపరాది సుధాకర్, పెరుమాండ్ల సమ్మయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, చంద్రసేనాచారి, మురళి, శివశంకర్, యుగేందర్, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటస్వామి, రాజు, సాయిచరణ్‌గౌడ్, ఐలయ్యగౌడ్ పాల్గొన్నారు.



విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అయ్యప్ప స్వాములు

విరాళాలు అందజేత

అయ్యప్ప ఆలయానికి మండల కేంద్రానికి చెందిన చందుపట్ల నర్సింహారెడ్డి రూ.56,516, కడిపికొండకు చెందిన కంకణాల ప్రభాకర్ రూ.10,116, వడ్డె రమేష్ రూ.5,016, పెరిక సంఘం రూ.5,100, వారాల సంఘం రూ.5,116 చొప్పున గురుస్వామి ఇందుర్తి జానకి రామారావుకు విరాళాలు అందజేశారు. దాతలను గురుస్వామి జానకి రామారావు అభినందించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్‌గౌడ్, అయ్యప్ప స్వాములు రామగిరి శ్రీధర్, ఎండపెల్లి మల్లారెడ్డి, దుండుకూరి రాజు, జక్కు కృష్ణమూర్తి, పచ్చిమట్ల రాజయ్యగౌడ్, మండల వెంకటస్వామి, బాలసాని మధు, ట్రాన్స్‌కో ఏడీ కొండమీది రాజు, నానా పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నర్సింహారెడ్డి

పంటల సాగులో మెళకువలు కీలకం

ధర్మసాగర్ (వేలేరు) : పంటల సాగులో రైతులు మెళకువలు పాటించడం కీలకమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. మండలంలోని కన్నారం గ్రామంలో పొద్దుతిరుగుడు పంటల క్షేత్రాలను శనివారం శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడారు. గ్రామంలోని పొద్దుతిరుగుడు పంట ప్రస్తుతం మొగ్గ నుంచి పువ్వు వికసించే దశలో ఉన్నట్టు తెలిపారు. ఈ దశలో నీటి తడులు ఇవ్వాలని, 2 గ్రాముల బోరాన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంటల్లో ఆకు మచ్చ, వేరుకుళ్లు తెగుళ్లు తెగుళ్లు ఉన్నట్టు తెలిపారు. కొన్ని పంటల్లో ఆకు తినే లద్దె పురుగు ఉధృతి ఉందన్నారు. ఆకు మచ్చ తెగులు నివారణకు లీటర్ నీటిలో గ్రాము ప్రొపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వేరు కుళ్లు ఆశించిన మొక్కలను పీకి కాల్చేయాలని తెలిపారు. వయ్యారి భామ కలుపును తీసేయాలని సూచించారు. వయ్యారి భామ కలుపుతో నెక్రోసిస్ తెగులు ఆశించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కేవీకే సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు, వ్యవసాయ విస్తరణ అధికారి బాబు, రైతు కోఆర్డినేటర్ కొమురయ్య, రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి శ్రీను, ఆదర్శ రైతు మాచర్ల చందర్ పాల్గొన్నారు.



రైతులకు సూచనలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

వెనుకబడిన కులాలకు సీట్లు కేటాయించండి



ఐనవోలు : రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన కులాల ప్రతినిధులకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 10 సీట్లు కేటాయించాలని టీపీసీసీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను ఏఐసీసీ జాయింట్ కోఆర్డినేటర్, మధ్యప్రదేశ్ ఓబీసీ విభాగం ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి కోరారు. మండలంలోని నందనం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాదగిరి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఠాక్రేను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. రాష్ట్రంలో రజక, నాయి బ్రాహ్మణ, మేదర, దాసర తదితర 36 నుంచి 41 కులాలు అత్యంత వెనుకబడినవిగా గుర్తించామన్నారు. ఈ కులాల జనాభా సుమారు 33 లక్షలకు పైగా ఉన్నట్టు తెలిపారు. వారందరికీ సముచిత ప్రాధాన్యత కల్పించేలా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఠాక్రేను యాదగిరి కోరారు.

అవగాహనతోనే క్యాన్సర్ నిర్మూలన



దామెర : కార్యక్రమంలో జడ్జి రాధాదేవి, ఇతరులు

● జిల్లా న్యాయమూర్తి కె. రాధాదేవి

దామెర : అవగాహన పెంచుకోవడం ద్వారానే క్యాన్సర్ నిర్మూలనకు బాటలు వేయగలమని జిల్లా న్యాయమూర్తి కె.రాధాదేవి స్పష్టం చేశారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఆహార అలవాట్లు, జీవనవిధానం మారకపోవడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. కాన్సర్ నివారణకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మద్ది రాహుల్‌నారాయణ, తిప్పని అవినాష్, డాక్టర్ ప్రతీక్, సీనియర్ సివిల్ జడ్జీ జె.ఉపేందర్, సెషన్స్ జడ్జీ కృష్ణమూర్తి, డాక్టర్లు హర్షిణి, డాక్టర్ సునీత, వినీత్ పాల్గొన్నారు.



దామెర : మాట్లాడుతున్న కె.సురేష్

వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనిత మాట్లాడారు. క్యాన్సర్‌కు వయస్సుతో సంబంధం లేదన్నారు. క్యాన్సర్ నుంచి రక్షించేలా అనేక ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకుని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదిస్తే మేలని సూచించారు. ప్రతిఒక్కరూ చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ కలిగి ఉండడంతోపాటు వ్యాయామం చేయాలని, చక్కటి జీవనశైలితో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుడు కె.సురేష్ మాట్లాడారు. విద్యార్థులు క్యాన్సర్ పట్ల చైతన్యవంతం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి శ్రీదేవి, బి.పద్మజ, కె.రాజమ్మ, జి.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సైడ్ డ్రైనేజీ నిర్మించాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని 5వ వార్డులో సైడ్ డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు శాంతిసాగర్, చింత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులను దయాకర్ శనివారం కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. వార్డులో సైడ్ కాలువలు లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపు నీరు రోడ్డు మీదకు చేరి జామ్ అయి రోడ్డు గుంతలమయం అవుతోందని తెలిపారు. రోడ్డుపై నడవాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్కూల్ పిల్లలు గుంతల్లో పడిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. సమస్యను గతంలో సర్పంచ్, అధికారులను కలిసి విన్నవించినా పరిష్కరించలేదని తెలిపారు. అనంతరం సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కోఇన్‌చార్జ్ గంగారపు శ్రీనివాస్, సురుగూరి కమలాకర్, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు, చింత రాజు గౌడ్, కల్లెపు శ్రీనివాస్, మర్రిపెల్లి శ్రీకాంత్, రమేష్, సుమన్, శ్యామ్, సరోజన, ఒలియ, ప్రేమ, రాజేశ్వరి, ప్రియ, పుణ్యవతి, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొడ్డు దయాకర్

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు



కౌన్సెలింగ్ ఇస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పరకాల : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. పట్టణంలోని మాధారం, వెంకటరమణ కాలనీల్లో ఏఓ శ్రీనివాస్, లైన్‌మెన్ శ్రీను ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం ఇంటింటికీ తిరుగుతూ తనిఖీలు చేశారు. మీటర్లు బిగించుకోకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలువురికి కౌన్సెలింగ్ చేశారు. ఎస్సీ కుల ధృవీకరణ పత్రం అందజేస్తే వినియోగదారులకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ఎస్సీలు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పోతన విజ్ఞానపీఠం వార్షికోత్సవం



రజనిశ్రీకళకు పురస్కారం అందజేస్తున్న సభ్యులు



పౌరాణిక పద్యనాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హన్మకొండ కల్చరల్: వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠం 36వ వార్షికోత్సవం సందర్భంగా మొదటి రోజు శనివారం పలు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పీఠం కార్యదర్శి గందె శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్‌వీఎన్.చారి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం వివిధ పాఠశాల విద్యార్థులకు శ్రీమద్రామాయణంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం సీనియర్ నటుడు జీఎస్.శర్మ మహారాజా రాణాప్రతాప్ ఏకపాత్రాభినయం చేశారు. అనంతరం వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో సీనియర్ నటుడు దేవరాజు రవీందర్ దర్శకత్వం వహించిన మాడిశెట్టి రమేష్ నిర్వహణలో విజయానిరుద్ధం అనే పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించారు. ప్రముఖ కళాకారిణి రజనిశ్రీ కళకు మహాకవి పోతన పురస్కార బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామోజు సుందరమూర్తి, చెనుమళ్ల శ్రీధర్, జూలూరు నాగరాజు, కళాకారులు పాల్గొన్నారు.

డివిజన్‌లో అన్నీ సమస్యలే

నయీంనగర్: 54వ డివిజన్‌లో అన్ని సమస్యలే ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆ డివిజన్‌లో శనివారం ఇల్లిల్లు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతర్గత రోడ్ల అధ్వానంగా ఉన్నాయని, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఎద్దేవాచేశారు. ప్రజా సమస్యలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కురిమిండ్ల సది, జిల్లా ఉపాధ్యక్షుడు పాశికంటి రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు దొంతుల వాసుదేవరెడ్డి, తోపుచర్ల మధుసూదన్, శ్రీనివాస్, అరణ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దామెర కృష్ణ

వరంగల్: ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు పైడిపల్లిలో 1161 (నిమ్మాయిచెరువు) సర్వే నంబర్‌లో నిర్వహించనున్న సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ పిలుపునిచ్చారు. నిమ్మాయిచెరువు వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన ప్రజా కళాకారులు తమ జీవన విధానంతో ప్రజా కళలను అంతర్భాగం చేసుకుని అనేక ఉద్యమాల్లో ముందుండి ప్రజలను చైతన్య పరచారని గుర్తుచేశారు. ఈటెల్లాంటి తమ పాటలతో ప్రజా కంటకుల ఆట కట్టించారని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యుడు గన్నారపు రమేష్, మండల కార్యదర్శి బుస్స రవీందర్, గుండె బద్రి, చిట్యాల సువర్ణ, వెంకన్న పాల్గొన్నారు.

జీపీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా రామన్న ఎన్నిక



నడికూడ : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా అధ్యక్షుడిగా నడికూడ మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ కారోబార్ పల్లె రామన్న ఎన్నికయ్యారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో శనివారం నిర్వహించిన సమా వేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. కోశాధికారిగా అడ్డగట్ల వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా బండి శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. నూతన అధ్యక్షుడు పల్లె రామన్న, కోశాధికారి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి శంకర్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.